అంతర పంటలతో లాభాలు

- నిమ్మ, మామిడి, చీనీ తోట మధ్యలో పంటల సాగు
- రైతులకు అదనపు ఆదాయం

యాడికి: రైతులు దీర్ఘకాలిక పంటల్లో అంతర పంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత నైసర్గిక స్వరూపంతో పాటు, సాగునీటి వనలరుల దృష్ట్యా రైతులు ఎక్కువగా నిమ్మ, మామిడి, చీనీ తోట లను సాగు చేస్తుంటారు. ఈ పంటలు దీర్ఘకాలికమైనవి కావడంతో ఏళ్ల తరబడి పెట్టుబడులు పెట్టాల్సిందే. దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ కష్టాలను అధిగమించేందుకు ఆ తోటల్లో అంతర పంటలుగా ఈ సీజన్‌లో వేరుశనగ, కనకాంబరాలు, బంతి, పెసర, మిరప, బంతి, ఉల్లి, జొన్నలను సాగు చేస్తూ రైతులు లాభాలు గడిస్తున్నారు.

వేలాది ఎకరాల్లో సాగు..

మండలంలో రైతులు 6,890 ఎకరాల్లో నిమ్మ, దానిమ్మ,. మామిడి, చీనీ, జొప్పాయి వంటి దీర్ఘకాలిక పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా నిమ్మ చెట్ల సాళ్లకు మధ్యలో 1500 ఎకరాల్లో అంతర పంటలు సాగు చేశారు. ముఖ్యంగా నిమ్మ, మామిడి, చీనీ మొక్కలు నాటి సాగు ప్రారంభించాక అవి పెరిగి కాపు కొచ్చే సరికి ఐదేళ్లు పడుతుంది. దీంతో రైతులు ఏటా నీరు కట్టేందుకు, ఎరువులు పెట్టేందుకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ ఐదారేళ్ల కూడా రైతులకు ఎలాంటి ఫలసాయం రాదు. దీంతో వారు ఏటా అప్పులు చేసి పంటలను సాగు చేయాల్సిందే. దీంతో ఇటీవల కాలం నుంచి రైతులు ఈ దీర్ఘ కాలిక పంటల్లో అంతర పంటలుగా సీజన్‌ను బట్టి సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. యాడికి మండలంలోని కోనుప్పలపాడు, ఓబుళాపురం, కత్తిమానుపల్లె, నగరూరు, వేములపాడు, చందన, పుప్పాల, పుప్పాల తాండా, కేశవరాయునిపేట, లక్ష్మంపల్లె, చింతలాయపల్లె, వెంగన్న పల్లె తదితర గ్రామాల్లో అంతర పంటలు సాగు చేస్తున్నారు.


చందన గ్రామంలో నిమ్మచెట్ల మధ్య టమాట సాగు చేసిన దృశ్యం


పిన్నేపల్లెలో నిమ్మ చెట్ల మధ్యలో అంతరపంటగా సాగు చేసిన కనకాంబరాలు

ఏటా కనకాంబరాల సాగు



నాకున్న 2 ఎకరాల నిమ్మ తోటలో ఏటా అంతర పంటగా పూల పంట సాగు చేస్తా. లేకుంటే నిమ్మ ఫలసాయం వచ్చే వరకూ ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నిమ్మ చెట్ల మధ్యలో కనకాంబరాలు సాగు చేశాను. పెట్టుబడి రూ.45 వేల వరకు వచ్చింది. కనకంబరాలు కేజీ రూ.500 వరకు పలుకుతోంది. మంచి దిగుబడితో పాటు గిట్టుబాటు ధర లభించటంతో రూ.3 లక్షలు పైగా ఆదాయం వస్తుంది.

–జ్ఞానేశ్వరరెడ్డి, పిన్నేపల్లె, యాడికి మండలం

వేరుశనగ సాగు చేశా



నాకున్న 5 ఎకరాల పొలంలో లేత చీనీ చెట్ల మధ్య అంతర పంటగా వేరుశనగ పంట వేశా. దీంతో ఆ పంటకు వేసే ఎరువులు, పిచికారీ చేసే పురుగు మందులు వృథా కాకుండా చీనీ మొక్కలకు పని చేస్తున్నాయి. అలాగే చీనీ పంట వచ్చే దాకా అంతర పంటల సాగుతో కొంత ఫల సాయం వస్తోంది.

–దొడ్డి వీరయ్య, పుప్పాల గ్రామం, యాడికి మండలం

అంతర పంటలతో అధిక లాభాలు



అంతర పంటలు సాగు చేసే రైతులకు అధిక లాభాలు ఉన్నాయి. నిమ్మ, మామిడి, చీనీ దానిమ్మ తదితర ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు చెట్లు నాటిన రెండేళ్ల వరకూ మాత్రమే అంతర పంటలు వేసుకోవాలి. నిమ్మ చెట్ల కంటే ఎక్కువ ఎత్తు పెరిగే పంటలను అంతర పంటలుగా వేయకూడదు. అంతర పంటలకు ఉపయోగించే క్రిమి సంహారక మందులు నిమ్మ చెట్లకు కూడా ఉపయోగపడతాయి.

–ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారిణి

క్లుప్తంగా

ఘనంగా పుష్యార్క హోమం


పుష్యార్క హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పుష్యమాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం పుష్యార్క హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుకు స్వాముల చిత్రపటాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తులు కోరిన కోర్కెలు తీరాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆలయ యాగశాలలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య హోమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

31న అశ్వత్థంలో బహిరంగ వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈనెల 31న బహిరంగ వేలం జరగనుంది. ఈ మేరకు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. వేలం పాటలో పాల్గొను ప్రతి ఒక్కరూ ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకా లు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు పసులూరులో దేవర

బుక్కరాయసముద్రం: మండలంలోని పసులూరు గ్రామంలో మంగళవారం పెద్దమ్మ దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో శింగరబట్లు, గణపతి, నారాయణ స్వామి

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం శింగరబట్లు, గణపతి, నారాయణ స్వామికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మాఘమాసం వచ్చే నెల 10 నుంచి ప్రారంభం కానునండడంతో దూరప్రాంతాలను చెందిన భక్తులు ముందుగా వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు అర్చకస్వాములు తెలిపారు. తిరునాల సందర్భంగా క్షేత్రంలో భక్తుల దర్శనార్థం ఎండవేడిమి తగలకుండా ముందు జాగ్రత్తగా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. భక్తులకు వారు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దవడుగూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయి స్వామి ఆదివారం తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలు తీసుకురావాలని పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

హమాలీ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శిగా మహేష్



గుంతకల్లు: హమాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గుంతకల్లుకు చెందిన మహేష్‌ను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో హమాలీ సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహేష్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ హమాలీ సమస్యల పరిష్కారానికి తన వంత కృషి చేస్తానని తెలిపారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం


వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు

- ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం ఎస్‌ఆర్ ఐటీలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తగా సీ.బండమీదపల్లికి చెందిన వీరాంజనేయులును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారన్నారు. వీరాంజనేయులు గెలుపునకు సైనికుల్లా పని చేద్దామన్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో పేదల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. ప్రధానంగా జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలను కుల, మత, పార్టీ భేదం లేకుండా అర్హతే ప్రమాణికంగా అందించారని గుర్తు చేశారు. వీటిపైన ప్రజలకు సోషల్ మీడియా ద్వారా విస్తృత్తంగా ప్రచారం చేయాలన్నారు. సమన్వయ కర్త వీరాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకోవడానికీ అందరం కృషి చేద్దామన్నారు. తనను నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించారని, అందరూ తనను సోదరుడిగా భావించాలన్నారు. అందరికీ అందుబాటులో ఉంటానని, పార్టీ విధేయుడిగా ఉంటానన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైవీఆర్‌పై చంద్రబాబు దిగజారుడు ఆరోపణలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లు: ఉరవకొండలో జరిగిన రా కదిలిరా సభలో గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిపై చంద్రబాబు దిగజారుడు ఆరోణపలు చేయడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు విమర్శించారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్‌బీ, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున శాస్త్రి, కో–ఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, కౌన్సిలర్ వై.సుధాకర్ విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వైవీఆర్ సోర్ట్ బియ్యం అమ్ముకుంటున్నారని, ఇసుకను డంప్ చేసి సొమ్ము చేసుకుంటున్నాడని చంద్రబాబు మాట్లాడటం చూస్తుంటే 'వినసకలే విపరీత బుద్ధి..మోసకారే మర్కటబుద్ధి' అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. భీమారెడ్డి కుటుంబం దాన ధర్మాలకు పెట్టింది పేరని, వైవీఆర్ తన సొంత నిధులతో అంబులెన్స్ ఏర్పాటు చేశారని, రూ.6కే వైఎస్సార్, వైవీఆర్ క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు కడుపునిండా భోజనం అందిస్తురన్నారన్నారు. గుడులు, బడులు, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ సాయం చేస్తున్న వైవీఆర్‌పై చంద్రబాబు ఆరోపణలకు ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు.

సీపీఐ జగదీష్‌కు వైవీఆర్‌ను విమర్శించే స్థాయి లేదు..

ధర్మవరం గేట్ వద్ద ఆర్‌యూబీ మంజూరుపై సీపీఐ నేత జగదీష్ ఎమ్మెల్యే వైవీఆర్ను విమర్శంచడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగదీష్‌కు ఎమ్మెల్యే విమర్శించే స్థాయి లేదన్నారు. ఆర్‌యూబీ కాకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుదని సూచిస్తున్న జగదీష్‌కు ఫ్లైఓవర్ నిర్మిస్తే ఎన్ని ఇళ్లను కూల్చివేయాలి, ఎంతమంది వ్యాపారులు రోడ్డు పడతారనే విషయం గ్రహించాలన్నారు. వీరిని దృష్టిలో ఉంచుకుని ఎంత వరకు ఏ ఎమ్మెల్యేకు సాధ్యం కానీ ఆర్‌యూబీని సాధించారన్నారు. గుంతకల్లులో బ్లడ్ బ్యాంకు, పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌డీఓ కార్యాలయం, పామిడి మున్సిపాలిటీని మేజర్ పంచాయతీగా మార్చడం తదితర పనులను చేపట్టారని గుర్తుచేశారు. 40 ఏళ్ల గుంతకల్లు చరిత్రలో ముస్లింలకు పెద్దపీట వేసిన వ్యక్తి వైవీఆర్ అని, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌తోపాటు రెండు కో–ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లను చేశారన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసి రెండెరాల స్థలాన్ని ముస్లిం శ్మశాన వాటిక కేటాయించారన్నారు. పట్టణంలో పరిశ్రమలో పోవడానికి, కొత్త పరిశ్రమలు రాకపోవడానికి కారణం ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. ఒక్కసారి మీ గురించి..మీ పార్టీ గురించి విశ్లేషించుకుని మాట్లాడితే బాగుంటుదని జగదీష్‌కు హితవు పలికారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బి.సుంకప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్ మోహన్, సీనియర్ నాయకుడు నూర్‌నిజం, కౌన్సిలర్లు జేసీబీ చాంద్, ఎస్సీ జిల్లా విభాగం కార్యదర్శి బావన్న, బీసీ సెల్ అధ్యక్షుడు మార్కెట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. బసినేపల్లి తండాకు చెందిన తిరుపాల్ నాయక్ బైక్‌పై పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా ఆసుపత్రి సమీపంలో ముందు వెళుతున్న బైక్‌ను ఢీ కొన్నాడు. ప్రమాదంలో తిరుపాల్ నాయక్. మరో బైక్‌పై వెనుక కూర్చున్న సావిత్రి గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'సీమ గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదు'

గుత్తి: రాయలసీమ గురించి మాట్లాడే హక్కు గాని, అర్హత కాని టీడీపీ అధినేత చంద్రబాబుకు లేదని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా ఆవరణలో ఆదివారం ఆయన ఐటీ విభాగం సభ్యులతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. ఉరవకొండ టీడీపీ సభలో చంద్రబాబు రాయలసీమకు ప్రాజెక్టులు తానే తెచ్చినట్లు బిల్డప్ ఇచ్చాడన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు రాయలసీమ ప్రాంతానికి ఒక్క ప్రాజెక్ట్ కూడా తీసుకురాలేదన్నారు. అలాంటి వ్యక్తి రాయలసీమలో పర్యటిస్తూ రాయలసీమకు వైఎస్సార్‌సీపీ , సీఎం వైఎస్ జగన్ ఏమీ చేయలేదని అబద్ధాలు వల్లించాడన్నారు. సీఎం జగన్ రాయలసీమ ప్రాంతమైన కర్నూలున్యాయ రాజధానిగా చేశారన్నారు. దాన్ని కూడా చంద్రబాబు అడ్డుకుంటున్నారన్నారు. రాయలసీమ ప్రాంతానికి వచ్చి అమరావతే రాజధాని అని చెప్పడంతో రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని తేటతెల్లమవుతున్నదన్నారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరో సారి విజయదుందుబి మోగించబోతుందన్నారు. వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం నాయకులు షావలి, శివ శంకర్, హరినాథ్‌రెడ్డి, హరితేజ తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. స్వామి బంగారు కవచంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.


నార్పలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

నార్పల: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరుకావడంతో వారిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో వారు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. దాదాపు 32 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరికొకరు పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తుకుచేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ దాదాపు 32 ఏళ్ల తర్వాత అందరినీ కలుసుకోవడం ఆనందకరమన్నారు. తాము విద్య నేర్పిన విద్యార్థులు ఇప్పుడు అన్ని రంగాలలో స్థిరపడినందుకు సంతోషంగా ఉందన్నారు. చివరగా విందుతో కార్యక్రమాన్ని ముగించారు.

సృష్టిని కాపాడాలి


మాట్లాడుతున్న పాస్టర్ రెవరెండ్ విశ్వమోహన్

పామిడి: దేవుడు సృజించిన సృష్టిని కాపాడాలని పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ పేర్కొన్నారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర మొదటి నెల అంత ఆదివారాన్ని పురస్కరించుకొని ఆరాధనోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు సృష్టిని సంరక్షించి ఏలు అధికారాన్ని మానవులకు ప్రాప్తింపజేశాడన్నారు. మానవ మనుగడకు ఎంతగానో తోడ్పడే సృష్టికి మానవులు విఘాతం కలుగజేస్తున్నారన్నారు. తద్వారా భూకంపం, సునామీ వంటి విపత్తులు కలుగుతున్నాయన్నారు. దీనిదృష్ట్యా సృష్టిని సంరక్షించి కాపాడాల్సిన బాధ్యత మానవులపై ఉందన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జయరాజు, రత్నరాజు, ఇల్లూరు రాజు, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణ, రజని, ప్రిస్కిల్లా, జయామణి, రేచెల్, వాణి, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలి


మాట్లాడుతున్న తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పదోన్నతిపై వెళ్తున్న ఎస్ఐ శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సాధారణమేనన్నారు. పని చేసిన ప్రతి చోటా వృత్తికి న్యాయం చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రధానంగా పోలీసు ఉద్యోగం ఎంతో సమస్యాత్మకంగా ఉంటుందన్నారు. సమస్యలు, గొడవలతో స్టేషన్‌కి వచ్చిన వారితో గౌరవంగా మాట్లాడితే సగం సమస్య పరిష్కారమవుతుందన్నారు. సమయానికి విధులకు హాజరు కావడంతోనే వ్యక్తిత్వం బయట పడుతుందన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎస్ఐను ఘనంగా సన్మానించారు. యాడికి సీఐ నాగార్జున రెడ్డి, పెద్దపప్పూరు, యాడికి ఎస్ఐలు శరత్‌చంద్ర, గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

అనంతపురం కల్చరల్: నగరంలో వారం రోజుల పాటు సందడిగా సాగిన అనంత లఘుచిత్రోత్సవం ఆదివారం ముగిసింది. సినీ దర్శకుడు, నిర్వాహకుడు రషీద్‌బాషా ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ సాగిన 6వ అనంత చిత్రోత్సవ ముగింపు వేడుకల్లో డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కరరెడ్డి, అడిషనల్ ఎస్పీ హనుమంతు, సినీ పరిశ్రమ నుంచి కట్టా వెంకట్, వెంకటేశ్వర ప్రభు తదితరులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్ద నగరాలకే పరిమితమైన చిత్రోత్సవాలను అనంతలో నిర్వహించేందుకు కృషి చేసిన రషీద్‌బాషాను అభినందించారు. ఉత్తమ జ్యూరీ అవార్డులకు ఎంపికైన మొదటి మూడు చిత్రాలకు, ఉత్తమ కొరియోగ్రాఫర్‌కు, అనంత సంస్కృతిక వారసత్వ వైభవంపై వచ్చిన మొత్తం 21 లఘుచిత్రాలకు రూ.5 వేలు చొప్పున బహుమతులు అందించారు. అనంతరం సీనియర్ రచయిత కంబదూరు నబీరసూల్ రచించిన 'కమ్మని కంఠం' నాకు లేదు పుస్తకాన్ని జిల్లా రచయితలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సామాజిక సేవా కార్యకర్తలు అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జగన్‌మోహనరెడ్డి, ఆర్‌టీఐ అధ్యక్షులు హొన్నూరప్ప, వీర నరసింహారెడ్డి, జాకీర్, పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయానికి రూ.2 లక్షల విరాళం


చెక్కును సర్పంచ్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వాల్మీకీ మహర్షి ఆలయానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.2 లక్షలు విరాళాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ మురహరి నాయుడు, ఎంపీటీసీ నాగప్ప ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని కలిసి గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన వారికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ సుమతి తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో ఇస్తే అధికారులు మసస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సమస్యలు ఉన్నట్లు అయితే అర్జీల రూపంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వివాహిత అదృశ్యం

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన రమీజాబీ 10 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ప్రయోజనం లేకపోయింది. బాధితురాలి భర్త పాషావలి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి బాధితురాలి కోసం గాలింపు ప్రారంభించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గడ్డివామి దగ్ధం


కాలిపోతున్న గడ్డివామి

గార్లదిన్నె: మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ సమీపంలో ఆదివారం రాత్రి ఓ రైతుకు చెందిన గడ్డివాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిబూడిదైంది. బాధిత రైతు రాజమోహన్ తెలిపిన వివరాలు..పశువుల మేత కోసం రెండు ట్రాక్టర్లు వరిగడ్డి కొనుగోలు చేసి వ్యవసాయ పొలంలో నిల్వ ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నిమంటల్లో కాలి బూడిదైంది. దాదాపు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన అవసరం

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ విజ్ఞానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. సమాజాన్ని శాస్త్రీయ ఆలోచనలతో నింపడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో జేవీవీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథిగా హాజరైన డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానంపై చాలా మందికి అవగాహన లేకపోవడం వల్లే సమాజంలో ఎన్నో దురాగతాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఎంతో నష్టపోతున్నారన్నారు. మూఢనమ్మకాలవైపు మళ్లించడానికి సాగుతున్న చర్యలను ప్రభుత్వాలు కూడా పట్టించుకోవాలన్నారు. దీన్ని సరిజేయడానికి జేవీవీ కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిలాన్ బాషా, సురేష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జైళ్లశాఖ ఉద్యోగుల ఆత్మీయ కలయిక


మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ఫజుల్‌హక్

అనంతపురం అగ్రికల్చర్: విశ్రాంత జైళ్లశాఖ ఉద్యోగుల సంఘం (ప్రిసన్స్ డిపార్ట్‌మెంట్ పెన్షనర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కారాగారముల అధికారి కార్యాలయంలో ఆదివారంఆత్మీయ కలయిక నిర్వహించారు. కార్యక్రమానికి 75 మందికి పైగా విశ్రాంత జైళ్లశాఖ ఉద్యోగులు హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఫజుల్ హక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 75 ఏళ్లు పూర్తయిన ఐదుగురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.